ఉపాధి పనులను పరిశీలించిన కలెక్టర్

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

కామారెడ్డి రూరల్, జూన్ 13 : కామారెడ్డి మండలం కోటాల్‌పల్లి గ్రామాన్ని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ గురువారం సందర్శించి ఉపాధి పనులను పరిశీలించారు. రైతులు పంట పొలాల్లో ఫాంపాండ్స్ తవ్వుకోవాలని సూచించారు. ఫాంపాండ్స్‌తో కూలీలకు ఉపాధి లభిస్తుందని, భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. పండ్ల తోటలు పెంచుకోవాని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగవర్ధన్, ఏపీవో నరేందర్, పంచాయతీ సెక్రటరీ గంగుబాయి పాల్గొన్నారు.

స్కూల్ యూనిఫామ్స్‌ను సకాలంలో అందించాలి

బాన్సువాడ రూరల్, జూన్ 13 : బాన్సువాడ మండలంలోని దేశాయిపేట్ గ్రామంలో డ్వాక్రా మహిళల కుట్టుమిషన్ కేంద్రాన్ని ఎంపీడీవో బషీరుద్దీన్ సందర్శించారు. స్కూల్ యూనిఫామ్స్‌ను కుట్టి సకాలంలో అందించాలని మహిళా సంఘాల సభ్యులకు సూచించారు. మహిళలు కుట్టిన స్కూల్ యూనిఫామ్స్ ఆయన పరిశీలించారు. విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్స్‌ను త్వరగా అందించాల్సి ఉందని తెలిపారు. మహిళా సంఘాల సభ్యులు ఇచ్చిన గడువు నాటికి పూర్తిగా కుట్టి ఇవ్వాలని సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి రవి ఉన్నాడు.

తండాలపై ఎక్సైజ్ అధికారుల దాడులు

స్వాధీనం చేసుకున్న సారాతో ఎక్సైజ్ అధికారులు

మాచారెడ్డి, జూన్ 13 : మండలంలోని సోమార్‌పేట, బంజపల్లి గ్రామ పరిధిలోని పలు తండాల్లో ఎక్సైజ్ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా కామారెడ్డి ఎక్సైజ్ సీఐ విజయ్‌కుమార్ మాట్లాడారు. తండాల్లోని ననుగోత్ బాల్య, మాలోత్ రాజ్యల నుంచి ఎనిమిది లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నాటు సార తయారు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డీటీఎఫ్ సీఐ సుందల్‌సింగ్, ఎక్సైజ్ ఎస్సై విక్రమ్, సిబ్బంది బాల్‌రెడ్డి, మైసరాజు, శ్రీకాంత్‌రెడ్డి, నవీన్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి ఒకరి మృతి

భిక్కనూరు, జూన్ 13 : చేపల వేటకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందిన ఘటన భిక్కనూరులో చోటు చేసుకున్నది. ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం భిక్కనూరుకు చెందిన ఆకుల నర్సింహులు (56) బుధవారం చేపలు పట్టేందుకు మండల భిక్కనూరులోని బొబ్బిలి చెరువుకు వెళ్లాడు. చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడని తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటికి తీశారు. పంచనామా అనంతరం కామారెడ్డి ప్రభుత్వ ఏరియా దవాఖానకు తరలించి కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

20న నులిపురుగుల దినోత్సవాన్ని నిర్వహించాలి

అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

కామారెడ్డి, జూన్ 13 : పిల్లల్లో నట్టల నివారణకు ఈ నెల 20న 14వ జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవ కార్యక్రమంపై గురువారం ఏర్పాటు చేసిన జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నులిపురుగులు ఉన్నట్లయితే రక్తహీనత, పోషకాహార లోపం, ఆకలి లేకపోవడం, కడుపునొప్పి వంటి వాటితో బాధపడతారని అన్నారు. జిల్లాలో 1 నుంచి 19 ఏండ్లలోపు 2,50,254 పిల్లలున్నారని, వారికి నులి పురుగుల దినోత్సవం సందర్భంగా అల్బెండజోల్ మాత్రలు వేయనున్నామని తెలిపారు. రెండు సంత్సరాలలోపు పిల్లలకు సగం మాత్ర, రెండు, మూడు సంవత్సరాలలోపు పిల్లలకు ఒక మాత్రను నలిపి ఇవ్వాలన్నారు. 3 నుంచి 19 ఏండ్లలోపు పిల్లలకు చప్పరించేలా వేయించాలని అధికారులకు సూచించారు. ఈ మందులు వేసుకోవడంతో ఎలాంటి సైడ్ ఎఫెక్ట్ రావని, మధ్యాహ్నం భోజనం చేసిన తరువాత పిల్లలు మాత్ర వేసుకునేలా అందరు అధికారులు సమన్వయంతో పని చేయాలని చెప్పారు. ఏదేని కారణం చేత తప్పిపోయిన పిల్లలకు ఈ నెల 27న మాప్ అప్ కార్యక్రమాన్ని నిర్వహించి అందించాలని అన్నారు. అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాల్లోని పిల్లలకు మాత్రలు వేయాలని అన్నారు. అత్యవసర సమయంలో 108 అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి చంద్రశేఖర్, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి శిరీష, డీపీవో శ్రీనివాస్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, గిరిజన అభివృద్ధి అధికారి అంబాజీ, జిల్లా సంక్షేమాధికారి బావయ్య, ఇంటర్మీడియేట్ నోడల్ అధికారి షేక్ సలాం, డీఈవో రాజు, మెప్మా, మున్సిపల్ శాఖల అధికారులు, రెడ్ క్రాస్ సంస్థ చైర్మన్ రాజన్న పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

తాళం వేసిన ఇంట్లో చోరీ

13 గ్రాముల బంగారు, 15 తులాల వెండి ఆభరణాల అపహరణ

కామారెడ్డి, జూన్ 13 : జిల్లా కేంద్రంలో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడినట్లు పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం మధ్యాహ్నం సుమారు రెండున్నర గంటల ప్రాంతంలో సృజిత్ అనే వ్యక్తి తన ఇంటికి తాళం వేసి టైలర్ షాప్‌కు వెళ్లాడు. తిరిగి ఇంటికి వచ్చేసరికి తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా సామన్లు చిందరవందరగా పడి ఉన్నాయని తెలిపారు. బీరువాలో ఉంచిన 13 గ్రాముల బంగారు, 15 తులాల వెండి ఆభరణాలు, కొంత డబ్బును ఎత్తుకెళ్లారని తెలిపారు. సృజిత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పాఠ్యపుస్తకాలు పంపిణీ

మాచారెడ్డి, జూన్ 13 : పాల్వంచ మండలంలోని భవానీపేట జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులకు ఎంపీటీసీ దోమకొండ రాజనర్సు పాఠ్యపుస్తకాలను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సూర్యప్రకాశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏసీజీఈగా బాధ్యతల స్వీకరణ

కామారెడ్డి రూరల్, జూన్ 13 : జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఏసీజీఈ (అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్)గా బలిరాం, డీసీఈబీ కార్యదర్శిగా లింగం గురువారం బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, మండల విద్యాశాఖ అధికారులు రామస్వామి, జోసఫ్, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, శ్రీనివాస్, నాగభూషణం, హన్మాండ్లు, శ్రీకాంత్, నర్సారెడ్డి, జశ్వంత్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ఆశ వర్కర్ల ధర్నా

కామారెడ్డి రూరల్, జూన్ 13 : రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట గురువారం ఆశవర్కర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ఆశ వర్కర్లకు నష్టం కలిగించే పరీక్షలు పెట్టే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని అన్నారు. ఆశ వర్కర్లకు తగిన న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు రాజనర్సు, ఆశ వర్కర్ల జిల్లా అధ్యక్షురాలు ఇంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశ్రీ, పల్లవి, విజయ, పద్మ, లావణ్య, ప్రమీల, శోభ, మంజుల, స్వరూప పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశ వర్కర్లు

ఇంటింటి సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

బాన్సువాడ రూరల్/ భిక్కనూరు, జూన్ 13 : మిషన్‌భగీరథ ఇంటింటి కుళాయిల సమగ్ర సర్వేను పకడ్బందీగా చేపట్టి వందశాతం పూర్తి చేయాలని ఎంపీవో సత్యనారాయణరెడ్డి పంచాయతీ కార్యదర్శి సృజన్‌రెడ్డికి సూచించారు. గురువారం మండలంలోని కొల్లూరు గ్రామంలో ఆయన పర్యటించారు. మిషన్‌భగీరథ ఇంటింటి సర్వేను ఆయన పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఉన్న నీటి కుళాయిల సంఖ్య, ఇప్పటి వరకు పూర్తి చేసిన సర్వే వివరాలను అడిగి నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో ప్రతి ఇంటికి నీటి కుళాయి ఉందా, నీళ్లు సక్రమంగా సరఫరా అవుతున్నాయా, సరఫరా చేస్తున్న నీళ్లు కుటుంబానికి సరిపోతున్నాయా, పైప్‌లైన్ లీకేజీలు ఏమైనా ఉన్నాయా అనే తదితర వివరాలను సర్వే ద్వారా ప్రత్యేకంగా ఏర్పాట చేసిన యాప్‌లో నమోదు చేస్తున్నామని తెలిపారు. భిక్కనూరుతోపాటు జంగంపల్లిలో డీఎల్పీవో శ్రీనివాస్ మిషన్ భగీరథ సర్వేను గురువారం పరిశీలించారు. ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, మిషన్ భగీరథ ఏఈ శ్రీనివాస్, పంచాయతీ కార్యకదర్శి బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

చెట్లు, జంతువులను సంరక్షించాలి

రాజంపేట్, జూన్ 13 : అడవుల సంరక్షణ అందరి బాధ్యత అని, ముందు తరాలకు స్వచ్ఛమైన గాలి, నీరు అందించాలంటే చెట్లు, జంతువులను సంరక్షించుకోవాలని కామారెడ్డి డీఎస్పీ నాగేశ్వరావు అన్నారు. రాజంపేట మండలంలోని శేర్‌శంకర్ తండా గ్రామంలో గురువారం అటవీ చట్టాలపై గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అటవీ భూములను దున్నకూడదని అన్నారు. చట్టాలను ఉల్లంగిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో భిక్కనూరు సీఐ సంపత్ కుమార్, ఎంపీడీవో రాజేశం, ఎస్సై సంపత్, ఏపీవో సక్కుబాయి, సంతోష్, అటవీ శాఖ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్యను పరిష్కరించాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ

మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్

కామారెడ్డి, జూన్ 13 : పట్టణంలో నీటి సమస్య తలెత్తకుండా త్వరగా పరిష్కరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ మాట్లాడుతూ.. తాగునీటి ఎద్దడి తలెత్తకుండా, పట్టణంలో నెలకొన్న డ్రైనేజీ తదితర సమస్యను పరిష్కరించాలన్నారు. పట్టణంలో ఎక్కడకూడా తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. అవసరమైన చోట వాటర్ ట్యాంకర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. వాన కాలాన్ని దృష్టిలో పెట్టుకొని డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. రోడ్లపైన నీటి గుంతలు లేకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సుజాత, వైస్ చైర్మన్ ఉరుదొండ వనిత, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు గుడువు తేదీ పెంపు

బాన్సువాడ రూరల్, జూన్ 13 : బాన్సువాడ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు రెండో విడుత దోస్త్ దరఖాస్తులను ఈ నెల 15 వరకు పెంచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్ గురువారం తెలిపారు. 2024-25 మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఇంటర్‌మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రెండో విడుత దోస్తు దరఖాస్తు చివరి తేదీని 15 వరకు పెంచినట్లు ఆయన తెలిపారు. అటానమస్ కలిగిన ఎస్ఆర్ఎన్‌కే డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు పొందాలని విద్యార్థులకు సూచించారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ గంగాధర్

బాన్సువాడ, జూన్ 13 : బాన్సువాడ మున్సిపల్ పరిధిలోని ప్రధాన రహదారి పక్కన ఉన్న మురుగు కాల్వలను శుభ్రం చేసే పనుల్లో పాలకవర్గ సభ్యులు ప్రత్యేక దృష్టి సారించారు. మూడు రోజులుగా పట్టణంలోని పలు వార్డులు, ప్రధాన రహదారుల్లో మురుగుకాల్వలను కార్మికులతో శుభ్రం చేయిస్తున్నారు. మున్సిపల్ చైర్మన్ గంగాధర్ గురువారం కార్మికులు చేపట్టిన పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. తీసిన చెత్తాచెదారాన్ని మున్సిపల్ ట్రాక్టర్‌లో తరలించాలని, ప్రతి ఒక్కరూ పట్టణ పరిశుభ్రతకు సహకారం అందించాలని సూచించారు.

ప్రభుత్వ భూమిని పట్టా చేసిన అధికారులు

డబ్బులు తీసుకొని పట్టా చేశారనే ఆరోపణలు

లింగంపేట, జూన్ 13: డబ్బులు తీసుకొని అధికారులు ప్రభుత్వ భూమిని పట్టా చేసిన ఘటన మండలంలో చోటుచేసుకున్నది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రాంపూర్ గ్రామంలో ఉన్న సర్వే నంబర్ 16లో ఎనిమిది ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నది. దీనిలో సర్వే నంబర్ 16పైకి 3లో రెండు ఎకరాల భూమిని భవానీపేట తండాకు చెందిన లంబాడి చాంగీకి రెవెన్యూ అధికారులు గతంలో పట్టా చేశారు. అది ప్రభుత్వ భూమి అని కాస్రా పహాణిలో రాసి ఉన్నది. కాగా.. చాంగీ తమ పేరిట ఉన్న భూమిని హైదరాబాద్‌కు చెందిన పులిపాటి మమతకు విక్రయించింది. ఆమె ఈనెల 7వ తేదీన భూమిని రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు స్లాబ్ బుక్ చేసుకున్నారు. తహసీల్దార్ నరేందర్, రెవెన్యూ సిబ్బంది లక్షలాది రూపాయలు తీసుకొని అసైన్‌మెంట్ భూమిని పట్టా చేసినట్లు మండలంలో ప్రచారం జరుగుతున్నది.

ఈ విషయమై తహసీల్దార్ నరేందర్‌ను వివరణ కోరగా.. సర్వేనంబర్ 16పైకి3లోని రెండు ఎకరాల భూమి ప్రభుత్వ భూమిగా ఆన్‌లైన్‌లో మార్క్ కాలేదన్నారు. దీంతో పొరపాటున పట్టా చేశామని చెప్పారు. ప్రభుత్వ భూమి పట్టా రద్దు కోసం కలెక్టర్‌కు లేఖ రాస్తామని పేర్కొన్నారు.

నాగిరెడ్డిపేటలో భారీ వర్షం

విద్యుత్ సరఫరాకు అంతరాయం

నాగిరెడ్డిపేట, జూన్13: మండల కేంద్రంలో గురువారం సాయంత్రం ఇదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఇదురుగాలులకు మండల కేంద్రలో విద్యుత్తు తీగలు తెగిపోయాయి. దీంతో మండల కేంద్రంలో.. సాయంత్రం 4:30 నుంచి రాత్రి 8:30 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది.

గురుకులంలో బోధించేందుకు దరఖాస్తు చేసుకోవాలి

లింగంపేట, జూన్13: లింగంపేటలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో బోధించేందుకు అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వెంకటరాములు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాంఘిక శాస్త్రం బోధించడానికి బీఈడీ, పీజీలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని పేర్కొన్నారు. స్టాఫ్ నర్సు పోస్టుకు బీఎస్సీ నర్సింగ్‌లో 50శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఐదుశాతం మినహాయింపు ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులు కామారెడ్డి జిల్లా వాసులై ఉండాలని, ఈనెల 15వ తేదీ వరకు దరఖాస్తులను పాఠశాలలో అందజేయాలని సూచించారు.

బల్దియా కార్మికులకు పీఎఫ్ అమలుచేయాలి

మున్సిపల్ మేనేజర్ వాసంతికి వినతిపత్రం ఇస్తున్న మున్సిపల్ కార్మికులు

బీఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్

ఎల్లారెడ్డి రూరల్, జూన్ 13: మున్సిపల్ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, బీమా వర్తింపజేయాలని బీఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్ డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్ వాసంతికి మున్సిపల్ కార్మికులతో కలిసి ఆయన గురువారం వినతిపత్రం అందజేశారు. కార్మికులు ఏదైనా సమస్యతో మృతిచెందితే కుటుంబ సభ్యులకు పీఎఫ్, బీమా, పింఛన్ రావడం లేదన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రంలో కోరారు. అనంతరం బీఎల్‌టీయూ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చంద్రయ్య, ఉపాధ్యక్షులుగా వేణుగౌడ్, సాయిబాబా, సాయవ్వ, కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా మల్లేశ్, సంయుక్త కార్యదర్శులుగా శంకర్, దుర్గయ్య, కోశాధికారిగా లక్ష్మణ్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో బీఎల్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల రాజేందర్, ఎల్లారెడ్డి మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

దవాఖానలో సమస్యలు పరిష్కరించాలని తీర్మానం

సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ, జడ్పీటీసీ, దవాఖాన కమిటీ బాధ్యులు

నాగిరెడ్డిపేట, జూన్ 13: నాగిరెడ్డిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమస్యలు పరిష్కరించాలని తీర్మానించారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఎంపీపీ వినీత, జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి అధ్యక్షతన రోగి కల్యాణ సమితి సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో విద్యుత్ మరమ్మతులు, సర్జికల్ వస్తువుల కొనుగోలు, తాగునీటి సమస్య, అత్యవసర వస్తువుల కొనుగోలు, ప్లంబింగ్ తదితర సమస్యలపై చర్చించారు. ముగ్గురు స్టాఫ్ నర్సుల అవసరం ఉన్నదని, స్టాఫ్ నర్సు డిప్యూటేషన్‌పై కమిటీకి వివరించారు. సమావేశంలో మెడికల్ ఆఫీసర్ సృజన్‌కుమార్, ఎంపీహెచ్ఈవో రామారావు, సూపర్‌వైజర్ సునంద, శాంతిశ్రీ, సీనియర్ అసిస్టెంట్ కరీముల్లా, ఎంపీహెచ్ఏ మురళి తదితరులున్నారు.

సీఎంను కలిసిన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

ఎల్లారెడ్డి రూరల్, జూన్ 13: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధిపై మాట్లాడారు. ఇప్పటివరకు అందజేసిన నిధులకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరు చేయాలని కోరారు.

ద్విచక్ర వాహనం చోరీ

లింగంపేట, జూన్13: లింగంపేటలో బుధవారం రాత్రి ద్విచక్ర వాహనం చోరీకి గురైనట్లు బాధితుడు గడ్డం ప్రవీణ్ తెలిపారు. ప్రవీణ్ తన టీఎస్ 17బీ 5176 నంబర్ ఉన్న ద్విచక్ర వాహనాన్ని సహకార సంఘం షాపింగ్ కాంప్లెక్స్ ఎదురుగా పార్కింగ్ చేశాడు. గురువారం ఉదయం షాప్ వద్దకు వచ్చి చూడగా బైక్ కనిపించలేదు. దీంతో గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

బదిలీపై వెళ్తున్న పోలీసులకు సన్మానం

ఎల్లారెడ్డి, జూన్ 13: ఎల్లారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న పలువురిని గురువారం పోలీస్‌స్టేషన్‌లో సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ రవీందర్‌నాయక్ మాట్లాడుతూ.. అంకిత భావంతో పనిచేస్తే గుర్తింపు ఉంటుందని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని ఆయన సూచించారు. బదిలీపై వెళ్తున్న మహేశ్, రాము, సంపత్, రాధాకిషన్‌ను సన్మానించారు. ఎస్సై మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మిషన్ భగీరథ సర్వే

డోంగ్లీ/ రామారెడ్డి, జూన్ 13: ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా మిషన్ భగీరథ సర్వే కొనసాగుతున్నది. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు పర్యటిస్తూ కుళాయిల వివరాలను సేకరిస్తున్నారు. నమోదు చేసుకున్న వివరాలను వెంటనే ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. డోంగ్లీలోని ఎన్ బురా గ్రామంలో పంచాయతీ కార్యదర్శి సురేశ్ గురువారం సర్వే నిర్వహించారు. సదాశివపగర్ మండలంలోని కల్వరాల్‌లో నిర్వహిస్తున్న సర్వేను ఎంపీవో సురేందర్‌రెడ్డి పరిశీలించారు. గడువులోపు సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శికి ఆదేశించారు.

పొలాలకు వెళ్లే దారిలో కబ్జా తొలగింపు

కంచెను తొలగిస్తున్న ఇరిగేషన్ సిబ్బంది

ఎల్లారెడ్డి, జూన్ 13: ఎల్లారెడ్డి పట్టణ శివారులోని నాగన్నకుంటకు వెళ్లే దారిని కబ్జా చేస్తూ వేసిన కంచెను నీటి పారుదల శాఖ అధికారులు పోలీసుల సహాయంతో గురువారం తొలగించారు. నాగన్న కుంటకు వెళ్లే దారిని పట్టణానికి చెందిన విశ్వనాథం కబ్జా చేశాడని స్థానిక రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ ప్రాంతాన్ని గతంలో పరిశీలించిన నీటి పారుదల శాఖ అధికారులు.. కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ ఆదేశాలతో గురువారం కంచెను తొలగించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ శ్రీకాంత్, ఎల్లారెడ్డి ఎస్సై మహేశ్, స్థానిక రైతులు పాల్గొన్నారు. కంచెను తొలగించడంతో రైతులు సంతోషం వ్యక్తంచేశారు.

ప్రవేశాల కోసం ఇంటింటి ప్రచారం

ఎల్లారెడ్డి రూరల్, జూన్ 13: తల్లిదండ్రులు తమ పిల్లలను గురుకులంలో చేర్పించాలని కోరుతూ మైనార్టీ గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు గురువారం ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేశారు. పట్టణంతోపాటు సోమార్‌పేట్, కళ్యాణి గ్రామాల్లో పర్యటించి ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వారు విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కైలాస కాశీనాథ్, సంగీతం సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలి

లింగంపేట, జూన్ 13: లింగంపేటలోని బాలికల ఉన్నత పాఠశాల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఎంపీపీ గరీబున్నీసా బేగం గురువారం దుస్తులు, పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో రామస్వామి, ఎంపీడీవో నరేశ్, ఏపీఎం చామంతి శ్రీనివాస్, ఎంపీటీసీ షమీముున్నీసా బేగం, హెచ్ఎంలు శోభారాణి, సూరయ్యతోపాటు ఐకేపీ సీసీలు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దుస్తులను పంపిణీ చేస్తున్న ఎంపీపీ గరీబున్నీసాబేగం

ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఎల్లారెడ్డి రూరల్, జూన్ 13: ఎల్లారెడ్డిలోని మైనారిటీ గురుకుల కళాశాలలో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బొల్లం సుధీర్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో కామర్స్, ఎకనామిక్స్ ఇంగ్లిష్‌లో బోధించడానికి లెక్చరర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు ఈనెల 18వ తేదీలోపు కళాశాలలో దరఖాస్తులను అందజేయాలని, మరిన్ని వివరాలకు 9700805327 నంబరులో సంప్రదించాలని సూచించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

I, SHEMBARI CHANDANA, H.No: 1-111/1,KOTHAPALLY,MUPKAL(M), NIZAMABAD(D),CHANGED MY SURNAME / NAME AS SEMBERI CHANDANA
NTZ-324962

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు.